క్లుప్తంగా

లక్ష్మీనారాయణుడి సేవలో మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి



నరసరావుపేట: ఎన్జీవో కాలనీలో నూతనంగా నిర్మించి ఇటీవలనే ప్రారంభించబడిన శ్రీ లక్ష్మీనారాయణ సహిత అష్టలక్ష్మి అమ్మవార్ల దేవస్థానాన్ని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సందర్శించారు. శ్రీస్వామివార్లకు టెంకాయలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు డి.శ్రీనివాసరెడ్డి, యన్నం రవీంద్రారెడ్డి, నాగార్జునరెడ్డి, వేలమూరి రామకృష్ణారెడ్డి, అచ్చి శివకోటి, ఆళ్ల మణికంఠరెడ్డి, తురక నాగుల్‌మీరా, కుంచాల స్వామి, కర్నాటి కృష్ణమూర్తి, బహుదూర్, శివరాత్రి అశోక్ పాల్గొన్నారు.

రేపు వేల్పూరులో ప్రతిష్టా మహోత్సవం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న వీరబ్రహ్మేంద్ర విజ్ఞాన ఆశ్రమంలో పీఠాధిపతి బ్రహ్మదాసు నాయణ ఆరాధన ఉత్సవాలు నేటి నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, సెక్రటరి దేసు మల్లిఖార్జునరావులు శుక్రవారం తెలిపారు. ఈనెల 20న శ్రీ బ్రహ్మదాసు నాయణ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఉదయం 10.56 నిమిషాలకు జరుగుతుందని, ముఖ్య అతిథులుగా అచలానంద ఆశ్రమ ఒంగోలు పీఠాధిపతి పరిపూర్ణ సిద్దానంద స్వామి, బ్రహ్మంగారిమఠం తోటపల్లి ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వాముల పాల్గొంటారన్నారు. వేద పాఠశాల ఉపాధ్యాయులు, వేద పండితులు వడ్లమాని గోవర్ధనాచార్యులు, కడియాల ఆంజనేయశాస్త్రి, పూసపాటి నాగేశ్వరరావు శాస్త్రి, కోట వీరబ్రహ్మచారి, ఉమామహేశ్వర శర్మ, సారథ్యంలో వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు.

శ్రీరామా పబ్లిక్ స్కూల్లో ఉచిత ప్రవేశాలకు ఆహ్వానం

శావల్యాపురం: ఆర్.టి.ఐ చట్టం 2009 చట్టం ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒకటవ తరగతి ప్రవేశాలకు 25 సీట్లు కేటాయించామని ఎటువంటి ఫీజులు లేకుండా భర్తీ చేయడానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శ్రీరామా పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ కనగాల వెంకటరామ మోహన్‌చందు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన 25 సీట్లు భర్తీకు చేయడానికి ప్రభుత్వ నిబంధనల మేరకు నేటి నుంచి ఆసక్తి కల్గియున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో తమకు నచ్చిన పాఠశాలలో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్-8985214959 సంప్రదించాలన్నారు.

ఘనంగా శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామం గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి వెంబడి వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు శుక్రవారం గ్రామస్తులు తెలిపారు. స్వామివారి ప్రాంగణంలో మహిళలు పొంగళ్ళు పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి శర్మ స్వామివారిని పూలదండలు, నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్తులు రెండు విద్యుత్ ప్రభలను సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శాంతి భద్రతలు ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా స్థానిక ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తన సిబ్బందితో చర్యలు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు సమీపంలో హైవే పక్కనే గుర్తు తెలియని మృతదేహాన్ని గ్రామస్తులు శుక్రవారం కనుగొన్నారు. సమాచారాన్ని రొంపిచర్ల పోలీసులకు అందజేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి

ముస్లిం సంఘాల పిలుపు

చిలకలూరిపేట: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం నిర్వహిస్తున్న శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని అంజుమన్-ఏ-ఇస్లామియా, ముస్లిం జేఏసీ నాయకులు పిలుపు నిచ్చారు. పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో ఉన్న మర్కస్ మసీదు ప్రాంగణంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగంలోని ఆర్టికల్ 24,25,26 కల్పించిన హక్కులకు భంగకరంగా ఉందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని వెల్లడించారు. ఈ చట్టం వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం కాకుండా, వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ పరం చేసిదిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో అంజుమన్ ఇస్లామియా కమిటీ అధ్యక్షుడు షేక్ జానీపీర్, కార్యదర్శి షేక్ అహమ్మద్, ముఫ్తీ అనస్‌ఖాన్, సనా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మొహమ్మద్ యూసుఫ్ ఆలీ, రాజ్యాంగ పరిరక్షణా సమితి అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు, ముస్లిం జేఏసీ సభ్యులు షేక్ కరిముల్లా, షేక్ అబ్దుల్ రౌఫ్, షేక్ ఖయ్యూం, షేక్ అబ్దుల్ జబ్బార్ పాల్గొన్నారు.

ఘనంగా శుభ శుక్రవారం

శావల్యాపురం: మానవాళీ కోసం 2000 సంవత్సరాల క్రితం ఏసుక్రీస్తు శిలువపై మరణించిన రోజును శుభ శుక్రవారం (గుడ్‌ఫ్రైడే) అని అంటారని విమోచన ప్రార్థన మందిరం సంఘ కాపరి సీహెచ్ యేహెజ్కేలు అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నీ ప్రార్థన మందిరాల్లో ఘనంగా గుడ్‌ఫ్రైడ్ వేడుకలు క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విమోచన ప్రార్థన మందిరంలో మతబోధకులు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు మానవునిగా జన్మించి మానవుని పాపములు తనపై వేసుకొని సిలువపై రక్తం కార్చి చనిపోయిన మంచి దినాన్ని మంచి శుక్రవారం అన్నారు. శాంతి ప్రేమ, దయ, కరుణా ప్రపంచానికి శాంతి సంతోషం కల్గుతుందన్నారు. అనంతరం ప్రార్థన మందిరాల్లో సిలువ ధ్యాన కీర్తనలు, సిలువ ప్రాముఖ్యతలు గురించి వివరించారు. ఈ సందర్భంగా మత బోధకులు అన్నీ ప్రార్థన మందిరాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు పాటు ఉపవాస దీక్షలు నిర్వహించారు. ప్రార్థనలు అనంతరం చల్లటి పానీయాలు పానకం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విమోచన ప్రార్థన మందిరం నిర్వాహకులు కస్తూరి యేహెజ్కేలు, రాక్‌ప్రశాంత్, నిశాంత్, పద్మనాభుని కోటేశ్వరరావు, సోమేపల్లి వెంకటేశ్వర్లు, బత్తుల గురవయ్య పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్: ప్రపంచానికి ప్రేమ, కరుణ, క్షమాగుణాలను ప్రసాదించిన క్రీస్తు ఏసు జీవితం ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని సంఘ కాపరులు తెలిపారు. గుడ్‌ఫ్రైడే ని పురస్కరించుకొని పట్టణంలోని క్రైస్తవ ప్రార్థనాలయాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు ఏసు శిలువపై ప్రవచించిన వాక్యాలను విశ్వాసులకు వివరించారు. స్టేషన్ రోడ్డులోని టౌన్ బాప్టిస్టు చర్చి, చిలకలూరిపేట రోడ్డులోని లూథరన్ చర్చి, హార్డ్ కాంపౌండ్‌లోని తెలుగు మిలినీయం చర్చి, ప్రకాష్‌నగర్‌లోని పరిశుద్ధపౌల్ లూథరన్ చర్చి తదితర క్రైస్తవ ప్రార్థనాలయాలలో సంఘ కాపరులు క్రీస్తు సందేశాన్ని అందించారు.



బొల్లాపల్లిలో సిలువ మోస్తున్న విశ్వాసుడు

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి : మండలంలో పరిశుద్ధ శుక్రవారం నిర్వహించారు. ఏసు ప్రభువు మృతి చెందిన రోజున పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో రెవ.ఫాదర్ జాకబ్, బాలచందు ఆధ్వర్యంలో పరిశుద్ధ శుక్రవారం సందర్భంగా నాటక ప్రదర్శన నిర్వహించారు. ఏసుక్రీస్తు మృతిచెందిన రోజున 14 స్థలాల ప్రాధాన్యతలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో పరిశుద్ధ ఏసు సిలువ గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. విశ్వాసులు ఆసక్తిగా తిలకించారు. 40 దినాలు ఉపవాస దీక్షలు చేపట్టిన వారు దీక్ష విరమింపజేసే రోజుగా రెవ.ఫాదర్ జాకబ్ తెలిపారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు. ఏసు క్రీస్తును శిలువ వేసిన విధానం, ఆయన అనుభవించిన బాధలు గుర్తు చేసుకుని భక్తులు శోకతప్త హృదయాలతో ప్రార్థనలు నిర్వహించారు. నాదెండ్ల ఎపిఫానియా లూథరన్ చర్చిలో పాస్టర్ బి.మోహనరావు గుడ్‌ఫ్రైడే విశిష్టత వివరించారు. ఇర్లపాడు చర్చిలో విచారణ గురువులు పగడాల చిన్నప్ప ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం ఈస్టర్ పర్వదినాన ఏసుక్రీస్తు పునరుద్ధానం కానున్నందున ప్రార్థనలు నిర్వహించనున్నారు. గణపవరం హెబ్రోను ప్రార్థనా మందిరం, అంబేద్కర్ కాలనీలోని చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా పాస్టర్ ఎడ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని చర్చిలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు.

యడ్లపాడు మండలంలో....

యడ్లపాడు: పరుల పాపాలను కడిగివేసేందుకు యేసుప్రభు సిలువనెక్కిన రోజు శుభ శుక్రవారమని, ఇది క్రైస్తవ సమాజానికి ఎంతో శుభదినమని తిమ్మాపురం లూథరన్ చర్చి పాస్టర్ డేవిడ్ సుదీప్‌కుమార్ పేర్కొన్నారు. ఎంతో భక్తిభావంతో క్రైస్తవ విశ్వాసులు 40 రోజుల పాటు చేపట్టిన ఉపవాస దీక్షలను శుక్రవారం విరమణ చేశారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ప్రత్యేక తిమ్మాపురంలో లూథరన్‌చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. సంఘస్తులు, యూత్, సండేస్కూల్ చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం క్రైస్తవ సోదరులు గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. పగ, హింస, స్వార్థంతో నిండిన సమాజంలో ప్రేమా, సేవా భావాన్ని నింపడం కోసమే ఏసు క్రీస్తు శిలువను ఎక్కారని చెప్పారు. సమాజంలో ప్రేమను నింపేందెంకే క్రీస్తు చేసిన త్యాగాన్ని అందరూ స్మరించుకోవాలని ఫాదర్‌లు తెలిపారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్‌ఫ్రైడే విశిష్టను వివరించారు.

చిలకలూరిపేటలో....



ప్రసంగిస్తున్న పాస్టర్ కనపర్తి



చిలకలూరిపేట ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

చిలకలూరిపేట: క్రీస్తు చూపిన మార్గంలో పయనించినపుడే నిజమైన క్రైస్తవుడిగా జీవించినట్లని కర్ణాటక రాష్ట్రానికి చెందిన పాస్టర్ ప్యాటన్ వన్య బెతెలేల్ చెప్పారు. పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన ముఖ్య సువార్తీకుడిగా హాజరై ప్రసంగించారు. లోక రక్షకుడైన క్రీస్తు.. సర్వ మానవ పాప విముక్తికోసం మరణ శిక్ష పొందిన రోజును 'శుభ శుక్రవారం'గా పేర్కొంటూ క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో చేసుకుంటారని వివరించారు. ప్రార్థన అనంతరం ఉపవాస విరమణ చేసిన విశ్వాసులకు ప్రేమవిందు ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని అన్ని క్రైస్తవ మందిరాలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుండయ్యతోటలోని నిరీక్షణ ప్రార్థనామందిరం, భావనారుషి నగర్‌లోని తండ్రి సన్నిధి, పురుషోత్తమపట్నం మార్గంలోని ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయం, తూర్పుమాలపల్లిలోని పరిశుద్ధ మత్తయ్య చర్చి, సంజీవనగర్‌లోని పరిశుద్ధ పౌలు చర్చి, సాంబశివనగర్ జీవము గల దేవుని సంఘం, సెయింట్ చార్లెస్ హైస్కూల్ ప్రాంగణంలోని ఆర్సీఎం చర్చిల్లో కరుణామయుడు సిలువ వేసిన రోజును స్మరించుకున్నారు.

ఆర్సీఎం చర్చిల ఆధ్వర్యంలో సిలువ యాత్రను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో యూత్ క్రీస్తు, మేరిమాత వేషధారణ చేసి నాడు కల్వరిగిరిలో ఏసు ప్రభువు పడిన కష్టాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రభువు సిలువ మోసిన నేపథ్యం, ఏసు బోధనలు, సందేశాలు, వాక్యాలను మతపెద్దలు వినిపించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు హాజరై ప్రార్థనలు చేశారు.



నరసరావుపేటలో ప్రార్థనా గీతాలను ఆలపిస్తున్న సంఘ కాపరి, విశ్వాసులు



నాదెండ్లలో మాట్లాడుతున్న పాస్టర్ మోహనరావు



బొల్లాపల్లిలో నాటక ప్రదర్శనలో ఓ భాగం



ఇర్లపాడులో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం



ప్రార్థనల్లో భక్తులు



యడ్లపాడు ప్రార్థనల్లో భక్తులు

బాలికా విద్యతోనే సమాజాభివృద్ధి

ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు

ఈపూరు(శావల్యాపురం): బాలిక విద్య ద్వారా సమాజ అభివృద్ధిపడుతుందని ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఈపూరు మండలం వనికుంట గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వెనుకబడిన వర్గాలకు అనుగుణంగా విద్యావసతులు ఏర్పాటు చేయటం మంచి శుభాపరిణామమన్నారు. 100 మంది బాలికల కోసం వసతి గృహానికి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే అన్నారు. రూ.2 కోట్లు 26 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న వసతి గృహంలో 20 గదులు నిర్మాణ పనులు పారదర్శకంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయటంతో పాటు పనులు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. జిల్లా సర్వశిక్షా అభియాన్ డి. రవీంద్రబాబు మాట్లాడుతూ మోడల్ స్కూల్లో 6 నుంచి ఇంటరు వరకు చదువుకునే విద్యార్థులు 460 మంది విద్యార్థులు ఉండగా 200 మంది బాలురు, 260 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. 2014-15 సంవత్సరంలో మోడల్ స్కూల్‌కు ప్రహరీ నిర్మాణ పనులు జరిగినట్లు తెలిపారు. 2019-20లో నాడు-నేడు పథకంలో స్కూల్ బిల్డింగ్ పనులు కోసం రూ.3 కోట్లు 26 అంచనాలు వేయగా రూ.కోటి 30 లక్షలు వ్యయం నిధులు మంజూరు కాగా గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ పనులు 40 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, సర్పంచ్ బచ్చలబోయిన సుబ్బయ్య, సర్వశిక్షా అభియాన్ డీఈ రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ ఇనిగంటి సునీల్‌బాబు చౌదరి, జాగర్లమూడి నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జిందాల్ పవర్ ప్లాంట్‌లో మాక్‌డ్రిల్

- అగ్నిప్రమాదాలపై అవగాహన
- చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది హాజరు



జిందాల్ ఎనర్జీప్లాంట్‌లో అగ్నిప్రమాదాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యడ్లపాడు: అగ్ని ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చిలకలూరిపేట అగ్నిమాపక అధికారి ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. యడ్లపాడు మండలం కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని జిందాల్ ఎనర్జీ పవర్ ప్లాంట్ నందు శుక్రవారం అగ్నిమాపక శాఖ వారోత్సవాల ఐదవ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అమరులైన అగ్నిమాపక సిబ్బందికి నివాళి అర్పించారు. అగ్నిప్రమాదాల నివరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. 'జిందాల్ పవర్‌ప్లాంట్' సిబ్బందిలో చైతన్యం నింపేలా అత్యాధునిక పద్ధతిలో ఫైర్ మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఊహాజనిత అగ్ని ప్రమాదానికి ఎదురయ్యే సందర్భాన్ని ప్రతిరూపిస్తూ, అగ్నిమాపక చర్యలను ప్రదర్శించారు. ప్లాంట్ యాజమాన్యంతో పాటు, కార్మికవర్గం పాల్గొని ఫైర్ సేఫ్టీపై మెలకువలను తెలుసుకున్నారు. కేవలం అగ్నిమాపక సిబ్బందిపై కాకుండా, ప్రతి ఉద్యోగి అగ్నిప్రమాదాలపై అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లను అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్లు మాణిక్యరావు, వెంకయ్య, ఫైర్‌మెన్లు పవన్ కుమార్, రాజు, కరీముల్లా భాగస్వాములయ్యారు.

వినుకొండలో అగ్నిమాపక వారోత్సవాలు

వినుకొండ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల రిలయన్స్ పెట్రోల్ బంక్‌లోని సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్ర అధికారి బి.నాగేశ్వరరావు, సిబ్బంది పెట్రోల్ బంక్‌ల్లో సంభవించే ఆయిల్ అగ్ని ప్రమాదాలను ఏవిధంగా అరికట్టాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరావు, రమణారెడ్డి, రవికుమార్, కేశవబాబు, ప్రభాకర రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్య నగర్‌కు చెందిన గుమ్మడి కాశీ పవన్ కుమార్ ద్విచక్ర వాహనంపై పల్నాడు రోడ్డులో వస్తుండగా వాహనం అదుపు తప్పి శ్రీ రాఘవేంద్ర హస్పటల్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్నాడు. సంఘటనలో తల భాగానికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాల్లో చేర్పించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్ చరణ్ తెలిపారు.

జాతీయ రహదారిపై తప్పిన పెనుప్రమాదం

చిలకలూరిపేటౌన్: రోడ్డు ప్రమాదంలో లారీ, మినీలారీ ఢీకొన్నాయి. చిలకలూరిపేట మండలంలోని రామచంద్రాపురం గ్రామ పరిధిలోని లక్కీరోడ్‌లైన్స్ సమీపాన ఒంగోలు నుంచి గుంటూరు వైపు వస్తున్న లారీ ముందు వెళ్తున్న మినిలారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినిలారీ బోల్తా కొట్టింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడం, వాహనం దెబ్బతిన్నా అందులోని డ్రైవర్, క్లీనర్లకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

వరిగడ్డివామి దగ్ధం

నాదెండ్ల: వరిగడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తి నిప్పుపెట్టడంతో దగ్ధమైన ఘటన సాతులూరులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వజ్జా శ్రీనివాసరావు అలియాస్ బుల్లోడు ఇటీవల రూ.15 వేలతో 150 వరిగడ్డి మోపులు కొనుగోలు చేసి వామి ఏర్పాటు చేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో వామి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు గమనించి ఇతర వాములకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు

వినుకొండ: మండలంలోని శ్రీ మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా మొదటి రోజు వేలాది మంది ప్రజల సమక్షంలో ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శనలను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రారంభించారు. రెండు పళ్ల విభాగ పోటీల్లో 23 జతల ఎడ్లు పాల్గొన్నాయి. గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన శావల్యాపురం తహసీల్దారు



శావల్యాపురం: నూతన తహసీల్దారు ఎం.అర్జున్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రెంటచింతల మండలం తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు.. అనంతరం విలేకర్ల సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ప్రజలకు జవాబుదారీగా పని చేయాలన్నారు. రెవెన్యూ పరంగా ప్రజలు ఇచ్చిన ఆర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. రూపాయి లంచం లేకుండా అవినీతి రహిత పాలన కోసం అందరి సమన్వయంతో రెవెన్యూ సేవలు పారదర్శకంగా మండల ప్రజలకు అందేలా కృషి చేస్తామన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ చంద్రబాబు, వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఉప్పలూరి చిన మంగయ్య, కంప్యూటర్ ఆపరేటరు బ్రహ్మం ఉన్నారు.

హైవే మురుగు కాల్వల నిర్వహణ అధ్వానం



నాదెండ్ల: జాతీయ రహదారికి ఇరువైపులా మురుగుకాల్వల నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో సర్వీసు రోడ్డుపైకి బురద, మురుగు చేరి రాకపోకలకు తీవ్ర ఆటంకం తలెత్తుతోంది. తీవ్ర దుర్గంధం, బురద కారణంగా అటుగా రాకపోకలు సాగించాలంటే వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ముక్కుమూసుకుని వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీ పడమర వైపున, చిలకలూరిపేట శివారు ఏఎంజీకి ఇరువైపులా మురుగుకాల్వలు అధ్వానంగా ఉన్నాయి. నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది కాలువల నిర్వహణను పూర్తిగా విస్మరించటంపై స్థానికులు మండిపడుతున్నారు. కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, నెలకోసారైనా పూడిక తీయించి సమస్యలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాక రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ పలుచోట్ల ధ్వంసమయ్యాయని, వీటిని తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట నుంచి నరసరావుపేట వైపు బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గంగన్నపాలెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గంగమ్మగుడి సమీపంలో ఎదురుగా వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న మధు, సంతోష్ తీవ్ర గాయాలతో రోడ్డుపైనే పడి పడిపోయారు. బైక్ పూర్తిగా నుజ్జునుజ్జయింది. అప్రమత్తమైన స్థానికులు తీవ్రంగా గాయపడిన మధు, సంతోషలను 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ముగిసిన అచల దాసునాయన ఆరాధనోత్సవాలు

- హాజరైన వివిధ పీఠాధిపతులు
- తరలివచ్చిన భక్తులు



అలంకరణలో అచల దాసునాయన సమాధి

నాదెండ్ల: జాతీయ రహదారి గణపవరం సినిమా హాలు రోడ్డులో ఉన్న శ్రీకృష్ణాంజనేయస్వామి ఉపాసకులు అచల దాసునాయన స్వామి మఠం 86వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి మఠంలో పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు ప్రవచనాలు చేశారు. శుక్రవారం చివరిరోజు ముందుగా సమాధి పూజ నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ పోకల వెంకటరావు ఆధ్వర్యంలో హరేనామ సంకీర్తన చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులను స్థానిక పీఠాధిపతి అచల దాసునాయన, ధర్మకర్త మండలి ఛైర్మన్ నూతలపాటి హనుమాయమ్మ, సభ్యులు శాలువాలతో సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన వేటపాలెం శివకేశవ గురూజీ, ఓబులేశుపల్లి అఖిలాంధ్ర సాధు పరిషత్ సభ్యులు దయానంద్‌గురువు, హిందూ మత ధర్మపరిరక్షణపై ప్రసంగించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు వేమూరి హనుమంతరావు, కోటయ్య, సిద్ధానంద గురుజీ, ఈనాడుల సత్యనారాయణ, ఆంజనేయరెడ్డి, త్రిపురాంతకం సుబ్బయ్య, నరసరావుపేట నటరాజు, వేజెండ్ల జగన్నాథం, పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో పంగులూరు తహసీల్దార్ పోపూరి సింగారావు దంపతులను సన్మానించారు. సాయంత్రం గురువులచే శోభాయాత్ర నిర్వహించారు. అచల దాసునాయన జెండాకు గ్రామోత్సవం చేసి గురుపూజ నిర్వహించారు. రాత్రి భజనా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా భారీ అన్నదానం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో మఠం కిక్కిరిసింది.

జమ్ములమడక కాలువ కట్ట అభివృద్ధికి శ్రీకారం

నూజెండ్ల: జమ్ములమడక మేజర్ కాలువ మరమ్మతులు, పిచ్చి చెట్లు తొలగింపు కార్యక్రమం శుక్రవారం ములకలూరు డీసీ ఛైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి ప్రారంభించారు. మేజరు కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టి దశాబ్ద కాలం పైగా గడిచినా ఇప్పటి వరకూ ఎటువంటి మరమ్మతులూ చేపట్ట లేదు. దీంతో గట్ల వెంబడి పిచ్చి చెట్లు మొలిచి, కొన్ని చోట్ల లైనింగ్ దెబ్బతిని నీటి సరఫరాకు ఇబ్బందిగా మారింది.కార్యక్రమంలో ఎన్నెస్పీ జేఈఈ ప్రసన్న కుమార్, రైతులు పాల్గొన్నారు.